క్లుప్తంగా

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు



రామభద్రపురంలో శ్రీనివాస లాడ్జీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండల కేంద్రంలోని పలు లాడ్జీల్లో ఎస్ఐ సురేంద్రనాయుడు సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ కార్డు చూపించిన వారికే గదులు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్‌రాయుళ్లు, జూదర్లు వంటి వారు లాడ్జీల్లో మకాం వేసి, తమ కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉందని, అటువంటివి జరిగితే నిందితులతో పాటు లాడ్జీ యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాగిజావ పంపిణీకి ఏర్పాట్లు



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రామభద్రపురం: జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు రోజుల పాటు రాగిజావ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీన స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లను డీఈఓ లింగేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆరోజు విద్యార్థులతో వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ఇంటరాక్ట్ అవుతారు. దీనికోసం పెద్దస్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లపై ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శరవేగంగా ఆర్‌బీకేల నిర్మాణం



చాటాయివలస ఆర్‌బీకే నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: మండలంలో రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. 25 గ్రామ సచివాలయాల పరిధిలో వీటిని నిర్మించాల్సి ఉండగా, 15 చోట్ల నిర్మాణాలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మరో ఐదుచోట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. చాటాయివలస రైతుభరోసా కేంద్రాన్ని సర్పంచ్ కరణం గోవిందరావుతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు.

నిర్మాణాలు చకచకా..



కంచరాం సమీపంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

రాజాం: పట్టణ పరిధిలో కంచరాం సమీపంలో రాజాం అర్బన్ జగనన్న లేఅవుట్‌లో ఇండ్ల నిర్మాణాలు వేగవంతమయ్యాయి. ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుల ఖాతాల్లో సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది. దీంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈనెల 22 కనీసం వంద మంది లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శానిటేషన్ డ్రైవ్



రాజాం బస్టాండ్ వద్ద డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజాం: పట్టణంలో మూడురోజుల పాటు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వర్షాల కారణంగా డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టీడీపీదే విజయం

బొబ్బిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీ గెలుచుకోవడం ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను నిదర్శనమని మాజీ మంత్రి ఆర్‌వీఎస్‌కే రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభద్రు లు రాజ్యాంగ విలువలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారని తెలిపారు. విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్ ఓ బూటకంగా అభివర్ణించారు. టీడీపీ విజయం అన్ని వర్గాల్లో నూ ఆనందం నింపిందన్నారు.



రాజాం: తాలాడ వద్ద ఇటుకలు తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పిన తయారీదారులు



రేగిడి: రేగిడి సమీపంలో పంటపొలాల్లో చేరిన వర్షపునీరు



బొబ్బిలి రూరల్: పాడైన మొక్కజొన్న చేనులో రైతులతో వైఎస్సార్ సీపీ నాయకులు

అకాల వర్షం..
అన్నదాతకు నష్టం



వంగర: కొండచాకరాపల్లిలో వర్షాలకు పడిపోయిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు



డొంగురువలసలో నేలరాలిన మామిడికాయలు

రాజాం, రేగిడి: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో రబీ పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. నేలకొరిగిన పంటలను కట్టలుగా కట్టి కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వర్షాల కారణంగా పత్తికాయ పురుగుపట్టే ప్రమాదం ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. మరోవైపు ఇటుకల తయారీదారులు వర్షాలకు ఇటుకలు తడిపోకుండా టార్పాలిన్లు కప్పుకుని జాగ్రత్తపడ్డారు.

పాడైన పంటల పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పాడైన మొక్కజొన్న పంటను వైఎస్సార్ సీపీ నాయకుడు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన పంట నష్టంపై రైతులను ఆరాతీశారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం వచ్చేలా చూడాలని అన్నదాతలు కోరారు.

వర్షాలతో పంట నష్టం

బొబ్బిలి రూరల్: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో శని, ఆదివారం 5 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కారాడ, కొత్తపెంట, పిరిడి గ్రామాల్లో ఈదురుగాలులకు అరటి పంట నేలకొరిగింది. డొంగురువలస, మోసూరువలస, కోమటపల్లి, గున్నతోటవలస గ్రామాల్లో మామిడి పంట దెబ్బతింది. గాలుల తాకిడికి భారీ సంఖ్యలో మామిడికాయలు నేలరాలాయి. మరికొన్ని ప్రాంతాల్లో పత్తి, మొక్కజొన్న పంటలకు కూడా నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం పంట నష్టం అంచనా వేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు.



రాజాం: ఇల్లంనాయుడువలస-బొమ్మినాయుడువలస గ్రామాల మధ్య నేలకొరిగిన మొక్కజొన్న



రేగిడి: అంబఖండిలో పాడైన మొక్కజొన్నపంట



బొబ్బిలిరూరల్: కారాడ గ్రామంలో విరిగిన అరటిచెట్లు



వంగర: కొప్పరవలసలో నేలరాలిన జీడిమామిడి

ఘనజీవామృతంతో పంటలకు మేలు

బొబ్బిలి రూరల్: ఘనజీవామృతంతో పంటలకు మేలు కలుగుతుందని ప్రకృతిసేద్యం ప్రతినిధులు జి.సత్యవతి, జి.శ్రీరాములు, జి.అనిత అన్నారు. ఆదివారం మండలంలోని గొర్లెసీతారాంపురం, జగన్నాథపురం గ్రామాల్లోని రైతులకు ఘనజీవామృతం తయారీ, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు తొలుత ఆవుపేడ, ఆవుమూత్రం, బెల్లం, పప్పుదినుసుల పిండితో ఘనజీవామృతాన్ని ప్రయోగపూర్వకంగా తయారు చేసి, వివరించారు. అనంతరం దానిని పంటలకు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఇది చల్లడం ద్వారా పంటలకు ఎటువంటి చీడపీడలు, వ్యాధులు సోకవన్నారు. ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయని తెలిపారు.



గొర్లెసీతారాంపురంలో ఘనజీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి సేద్యం ప్రతినిధులు సత్యవతి, శ్రీరాములు, అనిత

పోలీసుల అదుపులో అంగన్‌వాడీ కార్యకర్తలు

బాడంగి: రాష్ట్ర అంగన్‌వాడీ యూనియన్ పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను మండలంలోని డొంకినివలస రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ జయంతి సిబ్బందితో కలిసి ఆదివారం అదుపు లోకి తీసుకున్నారు. పలు డిమాండ్ల సాధన కోసం అమరావతికి వెళ్లి, వారు ఆందోళన చేయనున్నట్లు తెలుసుకున్న పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు వారిని అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నట్లు సమాచారం.



రైల్వేస్టేషన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ జయంతి

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పొందవచ్చని, విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తకాలు చదవడంపై ఆసక్తి కనబరిచేందుకు గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పుస్తకాలు ఏ విధంగా చదవాలి, ఏయే పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందనే విషయాలను వారికి వివరించారు. ప్రతీ విద్యార్థి పాఠ్యపుస్తకాలతో పాటు, రామాయణం, మహాభారతం, ఇతిహాస గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలపై అవగాహన కల్పించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష విజేతలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ మినిస్టీరియల్ హాల్‌లో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన సీనియర్ ఇంజినీర్ శివానంద్, జేవీవీ నాయకులు రమణ ప్రభాత్ మాట్లాడుతూ ఏటా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టేందుకు ఈ ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలో విజేతలకు అభినందనలన్నారు. జిల్లాలో 96 మార్కులతో మొదటి స్థానంలో పాగిరి శ్యామల(రాజాం) నిలవగా, 95 మార్కులతో జయేంద్ర నాయుడు(విజయనగరం) రెండో స్థానం, లావణ్య(గంట్యాడ), దిలీప్(నెల్లిమర్ల) మూడో స్థానంలో నిలిచి, నగదు బహుమతి కైవసం చేసుకున్నారు. వీరికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు మెమొంటో కూడా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, డి.రాము, సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

బాడంగిలో వర్షం

బాడంగి: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఇదిలా ఉండగా, వర్షానికి ముందు వీచిన ఈదురుగాలులకు పలు చోట్ల సాగులో ఉన్న అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి.

అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు

వంగర: విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు హాజరయ్యేందుకు యత్నించిన ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదివారం వంగర పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి ధర్నాకు ఎటువంటి అనుమతి లేదని, ధర్నాలో పాల్గొందుకు ప్రయత్నిస్తే ముందస్తు చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

వంతెన నిర్మాణానికి మార్కింగ్

సంతకవిటి: మండలంలో వాల్తేరు వద్ద నాగావళి నదిపై రూ.87 కోట్లు వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. వంతెన నిర్మాణ ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించి పిల్లర్ల తవ్వకానికి మార్కింగ్ చేశారు. మొత్తం 16 పిల్లర్లకు మార్కింగ్ ఇచ్చినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయల్ నాయక్ తెలిపారు. అలాగే వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 14 ఎకరాలను రైతుల నుంచి సేకరిస్తున్నామన్నారు.

శ్మశానంలో మౌలిక వసతులు కల్పించాలి

రాజాం సిటీ: మారెడుబాక గ్రామంలో దళితుల శ్మశానవాటికలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన దళితులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 100 దళిత కుటుంబాలు ఉన్నాయని, ఎవరైనా మృతి చెందితే.. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్లేందుకు సరైన రోడ్డు లేదని, అక్కడ అంత్యక్రియల కోసం నీరు, ఇతర వసతులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని వారంతా కోరుతున్నారు.

వేసవి దుక్కులతో మేలు



రామభద్రపురంలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

రామభద్రపురం: వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే సాగు సమయంలో కలుపు బెడద అధికంగా ఉంటుంది. కలుపు మొక్కలు భూమిలోని నీరు, పోషక పదార్థాలను గ్రహించి పెరుగుతాయి. దీంతో భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోయి భూసారం తగ్గుతుంది. ఈ క్రమంలో రైతు వేసిన పోషకాలు కూడా లభించవు. అయితే వేసవి దుక్కుల వల్ల లోపలి పొరల్లో దాగి ఉన్న కీటకాల గుడ్లు, శిలీంధ్రాలు బయటకు వచ్చి, ఎండ తీవ్రతకు నశిస్తాయి. దుక్కిలో బయటపడిన పురుగులను సైతం పక్షులు తినడం వల్ల చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. మరింత లోతుగా దుక్కి చేసినట్లయితే పంటలకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. పురుగుల లార్వాలు నేలలో నుంచి బయటకు వచ్చి, ఎండ తీవ్రతకు చనిపోతాయి. ఈ నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు చేసుకోవడం మేలు అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. శనివారం వర్షం కురవడం వల్ల వ్యవసాయ పనులు చేసేందుకు పదును ఉండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎద్దులు ఉన్న వారు ఏరుతో, మరికొంతమంది టిల్లర్లర్, ట్రాక్టర్లతో పొలాల్లో వేసవి దుక్కులు దున్నుతున్నారు.

నేడు రాజాంలో 144 సెక్షన్ అమలు

రాజాం సిటీ: ఈ నెల 20న రాజాంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్ సెక్షన్-30 అమలు చేయనున్నట్లు టౌన్ సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక మెంటిపేట కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ అనుమానిత మృతిపట్ల కొంతమంది వ్యక్తులు ర్యాలీ, ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ధర్నాలో అసాంఘిక శక్తులు చేరి ప్రజాశాంతికి భంగం కలిగించనున్నట్లు సమాచారం అందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు 144సెక్షన్‌తో పాటు పోలీసు చట్టం సెక్షన్-30 అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, మరో 15 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారిణి బి.శాంతకుమారి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఖచ్చితంగా పదో తరగతి ఉత్తీర్ణత పొందాలని, అలాగే తెలుగు చదవడం, రాయడం బాగా రావాలన్నారు. 01-07-2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.7 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట మండపం వీధిలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన ఆలాపన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలపించిన భక్తిగీతాలు శ్రోతలను అలరించాయి. సంస్థ వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు పాల్గొన్నారు.

శరవేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా సచివాలయ, ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రాలు), హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, బల్క్ మిల్క్ కేంద్రాలు, ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణం చకచకా జరుగుతోంది. ఎం.ఆర్.అగ్రహారంలో దాదాపు రూ.46.58 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, చెత్త సంపద తయారీ కేంద్రం నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు తీసుకురావాలన్న సదుద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతీ గ్రామంలో ఆయా నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఈ పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి, పనులను త్వరితగతం చేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం అంతటా ప్రభుత్వ భవన నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చినట్లు సమాచారం.



ఎం.ఆర్.అగ్రహారంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు



ఎం.ఆర్.అగ్రహారంలో నిర్మిస్తున్న చెత్త సంపద తయారీ కేంద్రం



నిర్మాణ దశలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం